సాక్షి

# మెట్రో రెండో దశపై త్వరలో డీపీఆర్

## హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

**సాక్షి, సిటీబ్యూరో:** మెట్రో రెండో దశపై రూపొందించిన డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక)ను త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ నివేదికపై ప్రభుత్వ ఆమోదం లభించిన అనంతరం కేంద్రానికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. బేగంపేట్‌లోని మెట్రో భవన్‌లో 78వ స్వాతంత్ర్య దిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్వీఎస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. హైదరాబాద్ మహానగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వివిధ మార్గాల్లో మెట్రో రెండో దశ ప్రాజెక్టును ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్‌పోర్టు వరకు, ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి నుంచి హైకోర్టు నూతన భవనం, మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్, రాయదుర్గం నుంచి అమెరికన్ కాన్సులేట్, కోకాపేట్ తదితర మార్గాల్లో 78 కిలో మీటర్లకు పైగా మెట్రో రెండో దశకు ప్రణాళికలను రూపొందించిన సంగతి తెలిసిందే. నాలుగో సిటీగా ప్రతిపాదించిన ముచ్చర్ల వరకు కూడా మెట్రోను పొడిగించనున్నట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు రెండో దశ ప్రాజెక్టుపై రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేడుకల్లో హెచ్ఎంఆర్ఎల్ సీనియర్ అధికారులు ఆనంద్‌మోహన్, విష్ణువర్ధన్ రెడ్డి, బీఎస్ రాజేశ్వర్, ఎ.బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



16/08/2024 | Hyderabad (Hyderabad) | Page : 10
Source : https://epaper.sakshi.com/